క్లుప్తంగా

న్యాక్‌లో ముస్లిం మైనారిటీలకు ఉచిత శిక్షణ

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో 10వ తరగతి, ఆ పై తరగతులు చదువుతున్న ముస్లిం మైనారిటీ అభ్యర్థులకు మెటీరియల్ టెస్టింగ్, క్వాలిటీ కంట్రోల్ కోర్స్‌లో 3 నెలలు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు న్యాక్ నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్: 8008063922, 8247496936లలో సంప్రదించాలన్నారు.

వైభవం.. కల్యాణోత్సవం..



మియాపూర్: చందానగర్‌లోని విశాఖ శ్రీశారద పీఠ పాలిత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో పద్మావతి మాతా, శ్రీగోదాదేవి మాతా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా కొనసాగింది. శ్రవణ నక్షత్ర కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆలయంలో 15 మంది దంపతులతో ప్రధాన అర్చకులు శ్రీసత్యసాయి కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణంను వీక్షించి స్వామి వారిని దర్శించుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న కార్పొరేటర్ కుమార్‌యదవ్

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పాస్టర్స్ ఫెలోషిప్ అసోషియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అసోషియేషన్ అధ్యక్షుడు యాదయ్య(జాషువా) శనివారం తెలిపారు. నూతన కమిటీ ఉపాధ్యాక్షుడిగా డేవిడ్ రాజ్, జనరల్ సెక్రటరీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ప్రభుదాస్, ట్రెజరర్‌లుగా మోజెస్, ప్రభాకర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రత్నపాల్, కమిటీ సభ్యులుగా యేసయ్య, ఏసుపాదంను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నిక అనంతరం పటాన్‌చెరు కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకరంగా కలిశారు. ఎన్నికైన కమిటీ సభ్యులను కార్పొరేటర్ సన్మానించి, శుభకాంక్షలు తెలిపారు. పాస్టర్స్ అసోసియేషన్ కు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

మహిళల వేధింపులపై మరింత అవగాహన అవశ్యం




ఆన్‌లైన్ సమావేశంలో మాట్లాడుతున్న షీలా సూర్యనారాయణన్

రాయదుర్గం: పెరుగుతున్న లైంగిక, పునరుత్పత్తి దోపిడీపై మహిళ, బాలికలకు అవగాహన మరింతగా కల్పించాల్సిన అవసరం ఉందని హెచ్‌సీయూ మహిళా అధ్యయనాల కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షీలా సూర్యనారాయణన్ పేర్కొన్నారు. న్యూయార్క్‌లోని మహిళల స్థితిగతులపై కమిషన్ 67వ సెషన్‌లో 'మహిళలు, బాలికలపై అవగాహన పెంచడం' అనే అంశంపై ప్యానల్ సమావేశంలో ఆమె ఆన్‌లైన్ ద్వారా పాల్గొని తన అభిప్రాయాలను వ్యక్త పరిచారు.

జంట సర్కిళ్లలో వడగండ్ల వాన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో శనివారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, తారానగర్ వంటి ప్రాంతాల్లో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షాన్ని ఆయా కాలనీల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఇప్పుడిప్పుడే వాతావరణం వేడి ఎక్కుతున్న తరుణంలో వడగండ్లతో కూడిన వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లపైకి వరద నీరు రావడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకల్లో ఇబ్బందులకు గురయ్యారు.



గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ప్రహరీపై వేసిన పెయింటింగ్స్
















ప్రహరీపై వాల్ పెయింటింగ్ వేసిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన మీనా కుమార్







ఆధ్యాత్మిక సందేశం

గచ్చిబౌలి: ఒక చిత్రం బోలెడు అర్థాలను తెలుపుతుంది. ఆధ్యాత్మికత, స్వేచ్ఛ, శాంతి, ప్రకృతిని ప్రేమించడం.. మనమంతా ఒక్కటే అని తెలియజేసే వన్ గాడ్, వన్ వరల్డ్, వన్ ఫ్యామిలీని చిత్రాల ద్వారా కళ్లకు కట్టినట్టు చూపారు బ్రహ్మకుమారీస్ సంస్థ. ప్రశాంతత.. మంచి ఆలోచనలకు నాంది అని ఆయా చిత్రాలు సూచిస్తున్నాయి. బిజీ లైఫ్‌లో చాలామంది మానసిక ఒత్తిడికి లోనవుతారు. అలాంటి వారు నెగిటివ్‌గా ఆలోచించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని ద్వారా అనర్థాలు చోటు చేసుకునే అవకాశముంటుందని, ఆయా చిత్రాల ద్వారా తమను తాము సంస్కరించుకునేలా వివరిస్తున్నారు. కాగా రిలాక్స్, రిఫ్రెష్, ఇన్నర్ రీచార్జ్ కోసం దేశ, విదేశాల నుంచి అనేకమంది ఇక్కడకు వస్తుంటారు. దాదాపు 10 వేల అడుగుల పొడవు ఉన్న శాంతి సరోవర్ ప్రహరీపై 60 చిత్రాలు వేయనున్నారు. శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం తులుసూరుపల్లికి చెందిన చిత్రకారుడు మీనాకుమార్ రెండు నెలలుగా పెయింటింగ్స్ వేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

తిరుమలలో జరిగిన వేడుకలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు గాంధీ, సుభాష్ రెడ్డి

గచ్చిబౌలి: తిరుమలలో 24 గంటల నిరంతర హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలసమ్మ ఫౌండేషన్, నందనపాటి బ్రదర్స్, పోలీస్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు శివ కుమార్ పర్యవేక్షణలో ఈ పారాయణం సాగింది. రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, సుభాష్‌రెడ్డిలు పాల్గొని పారాయణం చేశారు. వీరితో పాటు పలువులు నాయకులు, కార్యకర్తలు వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. తిరుమలలో హనుమాన్ చాలిసా పారాయణం చేయడం సంతోషంగా ఉందన్నారు.



హనుమాన్ చాలీసా పారాయణంలో మంత్రి సత్యవతి, రాథోడ్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నూతన దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రూపా శ్రీకొంటీ కాలనీ ఎదురుగా నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, అష్టలక్ష్మీ దేవాలయ నిర్మాణాలకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్ రెడ్డి, బోయిని బాలమణి బాలరాజు, నవనీత జగదీశ్, బిజిలి రాజు, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, యునుస్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, మహిపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొల్లూరి యాదగిరి, ఆంజనేయులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణవేణి స్కూల్ వార్షికోత్సవం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని శ్రీకృష్ణవేణి హై స్కూల్ వార్షికోత్సవాన్ని ఫెస్ట్ ఆఫ్ ఇన్‌విక్టస్–2023 పేరిట శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, శ్రీనిధి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ గీతలు పాల్గొని ఫెస్ట్‌ను తిలకించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అభ్యాస ఆకాడమీ చైర్మన్ పవన్, కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

అదృశ్యమై..ఆపై మృతదేహమై..

పటాన్‌చెరుటౌన్: ఇంటినుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి మూడురోజుల తర్వాత మృతదేహమై కనిపించాడు. భానూర్–బీడీఎల్ ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం..మండలపరిధిలోని నందిగామకు చెందిన శంకర్(37) పెయింటర్‌గా, భార్య అండాలు ఓ కళాశాలలో హౌస్‌కీపింగ్ చేస్తోంది. పెయింటింగ్ కాంట్రాక్ట్ చేస్తుండగా, శంకర్‌కు నష్టం వచ్చింది. దీంతో రెండునెలల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స అనంతరం ఇంటివద్దే ఉంటున్నాడు. శంకర్ ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం స్కూటీపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటినుంచి నుంచి ఆచూకీ తెలియకపోవడంతో భార్య అండాలు, కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. శనివారం గ్రామశివారులోని సొంతవ్యవసాయ భూమి సమీపంలోని మర్రిచెట్టు వద్ద స్కూటీ కనిపించింది. దీంతో పొలం పరిసరాలతో వెతకగా, చున్నీతో ఉరివేసుకున్న ఆనవాళ్లతో శంకర్ మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య అండాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి..

పటాన్‌చెరుటౌన్: పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందాడు. అమీన్‌పూర్ ఎస్ఐ గణేశ్ కథనం ప్రకారం.. బీరంగూడ మంజీరనగర్‌కు చెందిన దుర్గయ్య(41) కూలిపనులు చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం సేవించి ఇంటికొచ్చి పడుకున్నాడు. సాయంత్రం భార్య లక్ష్మి వచ్చి చూడగా పడుకున్న చోటే మృతిచెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సృజనాత్మకతపై వర్క్‌షాప్



సర్టిఫికెట్లతో విద్యార్థులు

రాయదుర్గం: నగర విద్యార్థుల కోసం క్విక్సీ ఆధ్వర్యంలో సృజనాత్మకతపై వర్క్‌షాప్‌ను నిర్వహించి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. శనివారం నానక్‌రాంగూడలోని శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్ ఆవరణలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి చెందిన సాంకేతిక నిపుణులు, సాధారణ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి యువతను పరిచయం చేస్తున్నారు. అందులో భాగంగా ప్రముఖ నో–కోడ్ టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్ సహకారంతో ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయడం విశేషం. క్విక్సీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ వివేక్ గోయెల్ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో, అభ్యాసంలో నో–కోడ్ నైపుణ్యాలు చాలా విలువైనవిగా ఉన్నాయని, వాటిని భవిష్యత్తు విజయానికి బలమైన పునాదిని అందించవచ్చన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లను విద్యార్థులకు నిర్వహించి అవగాహన పెంచితే భవిష్యత్తులో రాణించడానికి అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



అఖిల్(ఫైల్)

మియాపూర్: ప్రేమించిన అమ్మాయి మాట్లాడటం లేదని, తన నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టిందని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ మండలం ఆరూర్ గ్రామానికి చెందిన చెల్మెడ అఖిల్(28) పటాన్‌చెరులోని శ్రీనగర్‌కాలనీలో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ ఐటీ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నెల 16న చందానగర్‌లోని ఓయో హోటల్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉన్నాడు. మరుసటి రోజు ఎంతకూ అఖిల్ బయటకు రాకపోవడంతో యాజమాన్యం కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గదిలో పరిశీలించగా అతడి మెయిల్‌లో ఓ సూసైడ్ నోట్‌ను గుర్తించారు. అందులో 'ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని.. గత కొన్ని రోజులుగా తనతో మాట్లాడకుండా తన ఫోన్‌ను బ్లాక్ లిస్టులో పెట్టిందని.. అందుకే సూసైడ్ చేసుకుంటున్నానని.. రాసి ఉంది. మృతుడి సోదరుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో సాగుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని తండాలలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాత దేవాలయాల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ తండాలో నూతనంగా నిర్మించిన సంత శ్రీ సేవాలాల్ మహారాజ్, జగదంబ మాత దేవాలయాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంతో పాటు రాజకీయరంగం లోనూ రిజర్వేషన్లు కల్పించి పరిపాలనలో భాగస్వాములు చేసిన మహోన్నత నాయకుడు కేసీఆర్ అన్నారు. నియోజకవర్గంలోనూ గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాధవి రవి నాయక్, కిష్టారెడ్డిపేట గ్రామ సర్పంచ్ కృష్ణ, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

గచ్చిబౌలి: చందానగర్ సర్కిల్ పరిధిలోని గౌతమీనగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. గౌతమీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కసిరెడ్డి భాస్కర్ రెడ్డి జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్యతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం అధ్యక్షులు సూనె సురేందర్‌తో కలిసి వెస్ట్ జోన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మురళీధర్, రామస్వామి, సాయికుమార్, జ్ఞానేశ్వర్, నర్సింహ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శిల్పవల్లి

ఓటీపీతో రూ.1.39 లక్షలు స్వాహా

● మోసాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు ● పరారీలో ప్రధాన నిందితుడు

మియాపూర్: ఆన్‌లైన్ యాప్ పేరుతో మోసం చేస్తున్న ఇద్దరిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శిల్పవల్లి, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు వివరాలను వెల్లడించారు. జైపూర్‌కు చెందిన జొహేర్ అలియాస్ రాహుల్ సైబర్ క్రైమ్ ద్వారా క్విక్ సపోర్ట్, ఎనిడెస్క్ సర్వర్, మంకీ క్విక్ సపోర్ట్ వంటి పలు యాప్‌లతో ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్నాడు. అమెజాన్ సెల్లార్‌లో పనిచేసే నల్గొండ జిల్లాకు చెందిన వేముల నాగప్రేమ్(21), అమెజాన్ ప్యాకింగ్‌లో పని చేసే బనవత్ కుమార్(20)లను రాహుల్ ఆన్‌లైన్ యాప్ ద్వారా మోసగించాడు. అది గమనించి వీరిద్దరు రాహుల్‌తో స్నేహం చేశారు. రాహుల్ ప్రతిభ, ప్రేరణతో ఆన్‌లైన్‌లో మోసాలు ఎలా చేయాలని నేర్చుకున్నారు. 2020 నుంచి వీరు ముగ్గురు కలిసి పలు రకాల యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో చందానగర్‌లో ఓ మహిళ బీఎస్ఎన్ఎల్ సిమ్‌ను ఫిబ్రవరి 9వ తేదీన కొనుగోలు చేసింది. ఆ సమయంలో సిమ్ కార్డు యాక్టివేట్ అయినప్పుడు యాక్టివేషన్ వస్తుందని సిమ్ కార్డు విక్రేత ఆమెకు తెలిపాడు. మార్చి 18న వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. అందులో బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ అని ఉండి ఓ నంబర్‌కు కాల్ చేయాలని పేర్కొని ఉంది. వెంటనే ఆమె ఆ నంబర్‌కు కాల్ చేయగా సైబర్ నేరగాళ్లు ఆమెతో మాట్లాడి కేవైసీ, ఎనిడెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని వచ్చిన ఓటీపీని చెప్పాలనడంతో ఆమె చెప్పగానే ఆమె అకౌంట్‌లో నుంచి రూ.1,39,900 కాజేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు నాగప్రేమ్, బవవత్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా రాహుల్ అనే వ్యక్తితో కలిసి మోసాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి 41 కేసులు ఉన్నాయి. వారి వద్ద నుంచి రూ. పది లక్షలు విలువ చేసే 15 సెల్‌ఫోన్లు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఓ యమహా బైక్, రూ.1.40 లక్ష నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగ జైపూర్‌కు చెందిన రాహుల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ క్యాస్ట్రో, డీఐ పాలవెల్లి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పోలీసులు సీజ్ చేసిన ల్యాప్టాప్, సెల్‌ఫోన్లు

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



రాయదుర్గంలో విద్యార్థులకు ప్యాడ్లను అందించిన కొమిరిశెట్టి సాయిబాబా



కొత్తగూడలో విద్యార్థులకు ప్యాడ్లను అందించిన కార్పొరేటర్ హమీద్‌పటేల్

గచ్చిబౌలి/రాయదుర్గం: పదో తరగతిలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను తీసుకరావాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా సూచించారు. రాయదుర్గం, ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు రంజిత్‌రెడ్డి పేరు మీద గల ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన పరీక్షల ప్యాడ్లను మాజీ కార్పొరేటర్ శనివారం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు తాజ్‌బాబు, వెంకట్‌రాంరెడ్డి, జహీరుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు నరేష్, సతీష్, అంజమ్మ, అక్బర్, రమేష్‌గౌడ్, శ్యామ్లెట్ శ్రీనివాస్, ప్రభాకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి: కార్పొరేటర్ హమీద్‌పటేల్

విద్యార్థులు కష్టపడి చదివితే, అత్యుత్తమ మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. కొత్తగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా పరీక్షల ప్యాడ్లను శనివారం అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మహ్మద్‌మొయినుద్దీన్, నాయకులు కృష్ణగౌడ్, శశిధర్‌రెడ్డి, షేక్‌చాంద్‌పాషా, జంగంగౌడ్, కుమార్, ఎర్రరాజు, లక్ష్మణ్, సాయి శామ్యూల్‌కుమార్, జహీర్, రాహుల్ పాల్గొన్నారు.